

# పెళ్ళిలో తీయనిది

కప్పగంతుల మల్లికార్జునరావు

తన మెళ్లో తాళికట్టేనాటికే రంగనాధానికి మరో పెళ్ళయిందని విశాలాక్షికి తెల్సు. అయితే ఆ మొదటిభార్య అంటే రంగనాధానికి 'అంత ప్రేమని మాత్రం తెలీదు. యిద్దర్నీ సమానంగా చూచుకొంటాడనుకొంది.

రంగనాధం రోజులో ఎక్కువ భాగం పెద్దభార్యదగ్గరే గడిపేవాడు. పొద్దున తొమ్మిదిన్నరకు వెళ్తే మళ్ళీ రాత్రి తొమ్మిదిన్నరకే అక్కడినుంచి వచ్చేవాడు.

యింతకీ ఆ పెద్దభార్య పేరు ఆఫీసు!

అదేంచిత్రమో వుద్యోగంలో చేరిన మర్నాటినుంచే రంగనాథానికి ఆఫీసుతో గొప్ప అనుబంధం ఏర్పడింది. క్రమంగా రంగనాథం లేకపోతే యిక ఆ ఆఫీసు నడవదా అన్నంత స్థాయికి పోయింది.

ఆఫీసర్లు ఎందరన్నామారనియ్యిగాక అందరూ రంగనాథాన్ని గౌరవించాల్సిందే. ఆయన సలహా లేనిదే ఎవరూ ఏ పనీ చేసేవారు కాదు.

అందుకు మొదటికారణం, ఆయనకు పనిమీద వున్న శ్రద్ధ. అందరి పనుల్నీ నెత్తినేసుకు చేస్తాడు. కిందివాళ్ళకి ఏంచేయలో తెలీకపోయినా, రాసే తీరిక లేకపోయినా, ఫైలు బల్లమీద పెడ్తే చాలు దాన్ని కూలంకషంగా చదివి సారం పిండి ఔషధంగా తయారుచేసేవాడు.

అంతేకాదు. రంగనాథానికి రూల్సు అన్నీ నాలికమీద వుంటాయి. ఏ రూలు ఎలా యింటర్ప్రెట్ చేయాలో ఆయనకి తెల్సినట్టు మరెవరికీ తెలీదు.

మూడోదీ ముఖ్యమైనదీ—రంగనాథం నమ్మకస్తుడు. యింటా ఆఫీసులో బయటాకూడా నికార్సయిన మనిషిగా పేరుపొందేడు. జీతంరాళ్ళు తప్ప 'మంత్రపుష్పా'ల రుచి ఆయనకి తెలీదు. మరొకరి సంగతి పట్టించుకునే స్వభావం కాదు ఆయనది. అందుకే ఆయనకు 'అజాతశత్రువు' అన్న బిరుదుకూడా యిచ్చారు.

పోనీ ఆయన ఎప్పుడూ డబ్బుకు కటకట లాడుతూ వుండేవాడా అంటే అదీలేదు. ఆయనకు అప్పుచేసే అలవాటు లేదు. ఆఫీసులో ఎప్పుడూ ఎవరితోనూ తన ఆర్థికస్థితినిగురించి మాట్లాడేవాడే కాదు. నిజానికి ఆయన డబ్బుకోసం ఏనాడూ బాధపడలేదు. అదే అందరికీ ఆశ్చర్యం! అయితే ఆ కిటుకు ఆయనకే తెల్సు. ఆయన చిన్నతనం నుంచీ తన అవసరాలని, కోరికల్ని అవధుల మేరకు సరిపుచ్చుకోటం నేర్చుకొన్నాడు. లేనిపోని ఆశల్ని పెంచుకోడు. ఆడంబరాలకు ఆయన అమడ దూరం. అందుకే ఆయన నైతికంగా దిగజారకుండానే వున్నంతలో సుఖంగా గుట్టుగా సంసారాన్ని నెట్టుకు రాగలిగేడు.

విశాలాక్షి, పెళ్ళయిన కొత్తల్లో ఆయన పద్ధతులకి కాస్తంత బాధపడ్డమాట నిజం. సాధింపులతో ఆయన్ని మార్చాలని ప్రయత్నించిందికూడా.

"ఎప్పుడూ ఆఫీసూ, ఫైళ్ళు యిదేనా లోకం? అలాంటివాడు నన్నెందుకు పెళ్ళిచేసుకొన్నారు? లోకంలో ఎందరు ఉద్యోగాలు చేయటంలేదు. అందరూ మీలాగా ఆఫీసులకు అతుక్కుపోయారా?"

"ఆ పక్కింటి పద్మావతికి వాళ్లాయన సంవత్సరానికి మూడు చీరెలు కొంటాడుట. మొన్న నెక్లెస్‌కూడా చేయించాడుట. మీరూ వున్నారు.

ఎందుకూ? వొక్క అచ్చటాముచ్చటా లేదుకదా? యివాళంటే యిద్దరమే కనుక జీతంరాళ్లు తిండికన్నా సరిపోతున్నాయి. రేపు నలుగురు పిల్లలు పుడ్తే..."

నలుగురు కాదుకాని రంగనాథం ముగ్గురు పిల్లలతండ్రి అయ్యాడు. యిద్దరు కొడుకులు, వాళ్ళమధ్య వో కూతురు.

అయినా రంగనాథం పద్ధతిలో యిసుమంతైనా మార్పులేదు. కాగా ఆయన వ్యక్తిత్వంలో మహత్తేమిటో విశాలాక్షే క్రమంగా ఆయన్ని అనుసరించిన దవటం నేర్చుకొంది. యిద్దరూ కలసి పిల్లల్ని అలాగే పెంచి పెద్దచేసారు.

పెద్దకొడుకు రవిశంకర్ యిప్పుడు ఆ వూళ్లోనే మ్యునిసిపాలిటీలో హెల్తు యిన్‌స్పెక్టర్. అతనికి యిద్దరు పిల్లలు. గుణంలో అచ్చం రంగనాధానికి నకలు రవిశంకర్.

కూతురికి 'గంతకు తగ్గ బొంతను' చూచి పెళ్ళిచేసి అత్తగారింటికి పంపేడు. చిన్నకొడుక్కి యీ మధ్యే హైదరాబాదులో గుమాస్తా వుద్యోగం వచ్చింది.

దాదాపు ముప్పైమూడేళ్లు కాపురం చేసిన పెద్దభార్యకు రంగనాథం విడాకులివ్వాల్సిన రోజు అది. రంగనాథం ఆ విడాకుల్ని కావాలనలేదు. పెద్దభార్యే యిచ్చేస్తోంది

రంగనాథం కుర్చీలోనుంచి లేచి అటూ యిటూ పచారుచేశాడు. పదోసారి చేతిగడియారాన్ని చూచుకున్నాడు. ఎనిమిదిన్నర!

తన పెళ్ళినాటి గడియారం. తప్పు నడవటం లేదుకదా?

యిన్నేళ్ళుగా ఆయనకి యిలాంటి ఆలోచన ఎప్పుడూ రాలేదు. యింటా బయటా అన్నిపనులూ టంఛన్‌గా ఆ గడియారాన్ననుసరించే చేసేడు

లోపల అంతా హడావుడిగావుంది. పిల్లలు దేనికోసమో కోడలిదగ్గర మారాం చేస్తున్నారు. రవిశంకర్ అప్పుడే డ్యూటీలోకి వెళ్ళినట్లుంది. విశాలాక్షి సరేసరి. వంటింట్లో సతమత మవ్వటం మామూలే!

ఎటొచ్చీ రంగనాథం స్థితే మామూలుకన్నా ఆ రోజు భిన్నంగా వుంది. రోజూ యీపాటికి ఆయన ఫైళ్ళు ముందేసుకుని కూర్చునేవాడు. 'సవతిపోరు యింట్లోకూడా తప్పదా?' అని విశాలాక్షి ఎప్పుడో అనుకొంది కాని యిప్పుడు ఆమెకంత తీరికకూడా లేదు. మిగతావాళ్ళకి ఆయన గదిలోకి వెళ్ళాలంటేనే భయం.

యింట్లో ఆయన పనులన్నీ టంఛన్‌గా జరిగిపోవాలి.

తొమ్మిదింటికల్లా కెళ్ళి పీటమీద కూర్చుంటాడు. తొమ్మిదింబావుకు చెయ్యికడుక్కొంటాడు. సైకిలెక్కి తొమ్మిదిన్నరకల్లా ఆఫీసుచేరుకుంటాడు.

యివాళ ఆ కార్యక్రమాలకి చివరి

రోజు. ఆ మాటకొస్తే నిన్ననే కొంత వరకు స్వస్తివాచకం అయింది.

అలవాటు ప్రకారం సాయంకాలం తీసికెళ్ళాల్సిన ఫైళ్ళ కట్టల్ని సంచీలో పెట్టుంటే ఆఫీసరు చూచాడు.

"యింకా ఎందుకండీ రంగనాథం గారూ మీకీ బరువు ? మీస్థానంలో వచ్చే అతను చూచుకొంటాడు లెండి. చివరిరోజు — యీ రోజైనా విశ్రాంతి తీసుకోండి."

యిన్నేళ్ళ ఉద్యోగ జీవితంలో ఆయన మనస్సు చివుక్కుమంది ఆ క్షణంలో. చివరిరోజు నేనేదో వ్రాసేసి పోతానని అనుమానం కాదుకదా? అన్న సందేహంకూడా వచ్చింది. ఆ రాత్రి మరి ఆయనకు నిద్రపట్టలేదు.

విశ్రాంతి!

తెల్లవారిన కొద్ది గంటల్లోనే విశ్రాంతి ఎంత భయంకరమైనదో తెల్సివచ్చింది రంగనాథానికి! యిక రేపటినుంచి కాలాన్ని గడిపేదెలా? భయంపట్టుకొంది.

మనవరాలి ఏడుపుతో రంగనాథం ఆలోచనల్నించి బయటపడ్డాడు. ఆదుర్దాగా లేచి గదిబయట కొచ్చాడు.

"చిన్నగా ఏడవ్వే. తాతయ్య వింటే కోప్పడ్తాడు." ఏడ్చే కూతుర్ని మందలిస్తోంది కోడలు.

"ఏమ్మా? పిల్ల ఎందుకేడుస్తున్నది?"

"చూడు తాతయ్యా. నా పుట్టిన రోజుకు పరికిణీ కొనమంటే అమ్మ కోప్పడుతోంది." కోడలు బదులు మనవరాలే జవాబిచ్చింది.

"నేను కొనిస్తాగా ? అమ్మ కలా చిరాకు తెప్పించవచ్చా? తప్పుకదూ? స్కూలుకు టైం అవటంలేదూ? తయారు కావాలి మరి!"

"యివాళే కొనిస్తావా మరి?"

"యివాళే కొనితెస్తా".

"మా తాతయ్య మంచివాడు."

ఎవరి దోవన వాళ్లు వెళ్ళేరు. మళ్ళీ వొంటరితనం!

* * *

రేపటినుంచి కాలాన్ని గడపటమెలాగా అని ఆలోచిస్తుంటే రంగనాథానికి భార్య గుర్తుకొచ్చింది.

పెళ్ళిచేసుకొన్నా డన్న మాటేకాని భార్య అచ్చటాముచ్చటా వొక్కటీ తీర్చలేదు. కాదు అసలు వాటినిగురించి ఏనాడూ ఆలోచించలేదు.

పెళ్ళయిన కొత్తల్లోనన్నా విశాలాక్షిని వొక్క సినిమాకు తీసికెళ్ళేడా? వొక్క చీరె కొనిచ్చాడా? కనీసం తన చేతుల్తో మల్లెపూలైనా తీసుకొచ్చాడా?

ఒక్కమనిషి వంటింట్లో యిన్నేళ్లూ సతమతమయిపోయింది. ఎలా చేసిందో, ఏంబాధలుపడిందో — తనకి మాత్రం అన్నీ టంచనుగా జరిగిపోయాయి. ఏనాడైనా తాను యీ చెంబుతీసి ఆ చెంబు అటు పెట్టేడా? పిల్లలు పుట్టేరు, పెరి

గేరు, పెద్దవారయ్యారు—యింత సంసారాన్ని భార్య ఎలా యీదిందో తనకు తెలీదు. తను చేసింది-జీతంరాగానే ఆ డబ్బు విశాలాక్షి చేతిలో పోయటం!

రేపటినుంచి భార్యకు వంటపనిలో సాయంచేస్తే? యిన్నేళ్లూ చెప్పని కబుర్లన్నీ భార్యముందు కూర్చొని చెప్తే?

యీ ఆలోచనలతో రంగనాథం మనసు ఆర్ద్రమయింది. ఆ క్షణంలో భార్యను చూడాలన్న కోరిక పుట్టింది. తన మనస్సులో ఆలోచనల్ని ఆమెకు చెప్పుకోవాలనిపించింది.

చేతి గడియారం చూచుకొన్నాడు. తొమ్మిదికి యింకా పావుగంటవుంది.

కాస్త సందేహించినా, దాన్ని మూలకునెట్టి చివాలున లేచి వంటయింటి వైపు నడిచేడు.

వంటయింట్లోనే వోమూలగా దేవుడి మందిరంవుంది. వుందని రంగనాథానికి లీలగా తెల్సుకాని ఆ మందిరాన్నికాని, అందులోని దేవుళ్ళనికాని రంగనాథం ఎప్పుడూ పరిశీలనగా చూడలేదు. ఆయనకు యిన్నాళ్ళూ ఆఫీసే దేవాలయం, ఫైళ్ళే దేముళ్ళాయె.

భార్యకోసం వెళ్ళిన రంగనాథం, దేముడి మందిరంముందు కూర్చున్న భార్యనుచూచి గుమ్మందగ్గరే ఆగిపోయాడు. ముందు అలంకరించివున్న మందిరాన్ని, అందులోని విగ్రహాలని చూచాడు. ఆ తర్వాత అతనిదృష్టి భార్యమీద పడింది.

విశాలాక్షి తలస్నానం చేసినట్లుంది. ఆరీ ఆరని శిరోజాలని వదులుగా ముడి వేసింది. పలితకేశాలు అక్కడక్కడా తెల్లగా తళుక్కుమంటున్నాయి.

గుండ్రంగా, అందంగావున్న ఆమె మొహానికి అర్ధరూపాయ వెడల్పున పెట్టుకొన్న కుంకమ వింతసోయగాన్నిస్తోంది. భక్తిభావంతో, అలసిపోయిన ఆమె కళ్ళు వింతగా ప్రకాశిస్తున్నాయి. పాతచీరలోనుంచి పసిమివన్నెగల ఆమె శరీరంలోని వంపుసొంపులు చాలా భాగం ప్రకాశిస్తూ కన్పిస్తున్నాయి.

యిన్నేళ్లొచ్చినా భార్య యింత అందంగా వుంటుందని రంగనాథానికి తెలియదు. భార్యను అంత పరిశీలనగా చూచే వ్యవధే ఆయనకులేదు. ఆ యిచ్ఛ ఆయనకు కలిగినట్లు గుర్తురాలేదు.

"జీవితమంతా యాంత్రికంగా గడిచిపోయింది," అనుకొని వొక్క క్షణం బాధపడ్డాడు.

యింతలో విశాలాక్షి మంగళహారతి యిచ్చింది. యిస్తూ ఏదో పాటపాడింది. ఎంత మాధుర్యంగా వుందా కంఠం?

తను ఎంత దురదృష్టవంతుడు? తనని చేసుకొన్న భార్య ఎంత దురదృష్టవంతురాలు?

విశాలాక్షి పూజ ముగించి లేచింది. భర్తను చూచి సిగ్గుపడింది. చాలీచాలని చిరుగుల చీరె కట్టుకొని వుందేమో



పమిట జారింది. ఎంత పైకి లాక్కొన్నా చినుగులు శరీరాన్ని కప్పలేకపోయాయి.

"ఛీ, వెళ్ళండి. తొమ్మిదయిందా అప్పుడే! ఎన్నడూ లేనిది యివాళ ఎందుకొచ్చారు?" అంటూ శరీరాన్ని ఆ చినుగులచీరెతోనే కప్పుకోటానికి వృధాప్రయత్నంచేసింది.

రంగనాథం ఆ క్షణంలో భార్య పడ్తున్న అవస్థను చూడలేదు. ఆమె మాటల్ని వినలేదు.

ఆయన కళ్ళముందు పట్టుచీరె కట్టుకొని పూజచేసుకొంటున్న భార్య నిలిచింది. పట్టుచీరె రెపరెపలాడు తుండగా ఆమె తన పాలదాకు నమస్క

రిస్తోంది. తను ఆమెను ఆశీర్వదిస్తూ రెండు భుజాలు పట్టుకొని లేవనెత్తేడు. ఆ తర్వాత ఆమె తన రెండు చేతుల మధ్య యిరుక్కుపోయింది. హృదయానికి హత్తుకొనిపోయింది. వెచ్చటి ఆమె వుచ్ఛ్వాస నిశ్వాసాలు తన హృదయాన్ని గిలిగింతలు పెడ్తున్నాయి.

"ఏమిటండీ ఆలోచన. యిన్నాళ్ళకన్నా పూజామందిరం చూడటానికి చిక్కింది. నా అదృష్టం. శుక్రవారం యివాళ. దీర్ఘ సుమంగళిగా వుండాలని దీవించండి."

రంగనాధం భార్యని ఆశీర్వదించాడు. రెండుభుజాలు పట్టుకొని లేవనెత్త బోయాడు.

"తాకకండి. శుక్రవారం. అమ్మవారిపూజ చేసుకొన్నాను" అంటూ తప్పుకొంది.

శుక్రవారం! శుక్రవారం!

ఎప్పుడో భార్య అడిగి అడిగి నోరు నొప్పిపుట్టి అడగటం మానుకొన్న కోరిక గుర్తుకొచ్చింది.

"శ్రావణమాసం. పేరంటాలకి పోవాలన్నా, పూజచేసుకోవాలన్నా చచ్చే సిగ్గుగా వుందండీ. మీకు పుణ్యం వుంటుంది వొక్క పట్టుచీరె కొని పెట్టండి."

ఆ క్షణంలో భార్యకు పట్టుచీరె తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. కాని భార్యతో అనలేదు. అంటే ఆమె ఎక్కడ అభ్యంతరం చెప్తుందోనని భయం.

భోజనం వడ్డిస్తున్నంతసేపూ భర్త చూపులు విశాలాక్షి శరీరాన్ని చురుక్కుమనిపిస్తూనే వున్నాయి. ఆ కొత్త చూపులకి వొకవైపు ఏదో కొత్త అనుభూతి! మరోవైపు సిగ్గు! కొత్తపెళ్ళి కూతురిలా మెలికలు తిరిగిపోయింది విశాలాక్షి!

* * *

ఆఫీసరు దగ్గర్నుంచి, ప్యూనుదాకా ప్రతివొక్కరు రంగనాధానికి పూలదండ లేసేరు. పొగిడేరు. పూలగుభాళింపులు వొకవైపు – పొగడ్తల గుభాళింపులు మరోవైపు–రంగనాధం వుక్కిరిబిక్కిరయ్యాడు.

కార్యక్రమం చివర్లో రంగనాధం వూహించనిది వొకటి జరిగింది. ఆఫీసు అంతటి తరపున ఆఫీసరుగారు ఆయనకో పర్సు ప్రెజెంటు చేసేరు. రంగనాధం అభ్యంతరాలను అంతా తోసి పుచ్చారు.

"యిది మీ కార్యదక్షతకు, మంచితనానికి మేమిస్తున్న చిరుకానుక. ప్రేమకానుక. దీనితో మీకిష్టమైన వస్తువును కొని మా గుర్తుగా జీవితాంతం వుంచుకోవాలని మా కోరిక."

చప్పట్లు మ్రోగేయి. రంగనాధం హృదయంలో సప్తస్వరాలు మ్రోగేయి.

యింటికి వస్తూ దారిలోనే వో బట్టల

షాపుకు వెళ్ళేడు, మంచి పట్టుచీరె కొనానల. అప్పుడు మనవరాలికిచ్చిన మాట గుర్తుకొచ్చింది.

పట్టు పరికిణీ గుడ్డ బేరమాడితే మిగిలినడబ్బు చాల్లే.

భార్యకు పట్టుచీరెకొంటే మనవ రాలు పరికిణీ. మనవరాలికి పట్టు పరికిణీ కొంటే భార్యకు నూలుచీరె.

కాసేపు ఎటూ తోచలేదు. యిద్దరూ రెండుకళ్ళల్లో మెదిలేరు.

చివరికి భార్యకు పట్టుచీరె కొని, మనవరాలికి మిగతాడబ్బుతో మంచి పరికిణీగుడ్డ తీసుకొన్నాడు. కుర్రాడిలా యీలవేసుకొంటూ హుషారుగా యింటి వైపు నడిచేడు.

* * *

రంగనాథం గదిలో అటూ ఇటూ కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. మధ్యమధ్య ద్వారంవైపు ఆత్రుతగా చూస్తున్నాడు. మాటిమాటికీ గడియారం చూచుకొంటున్నాడు.

"అప్పుడే పదిగంటలు దాటిందే" అనుకొన్నాడు ద్వారంవైపు చూస్తూ.

మనవరాలు పరికిణీగుడ్డ చూస్తూనే సంతోషంతో గంతులేసింది. అదిచూచి లాగూ చొక్కా కావాలని మనవడు ఏడుపు. అల్లరి చేసిచేసి పిల్లలు పడు కొన్నట్లున్నారు.

యిల్లంతా వానవెలిసినట్లుంది. కొడుకు గదిలో ఏవో గుసగుసలు విన్పిస్తున్నాయి. అయినా వంటింట్లో శబ్దాలు యింకా ఆగవేం?

"రంగనాథం దిండు కిందినుంచి పేకెట్టును తీసి కొద్దిగా చింపి లోపలి చీరెను చూచాడు. నెమలికంఠం రంగురబంగారు రంగు జరీకి ఎర్రటి బార్డరు.

అంతవరకు ఆ చీరెను ఎవరికీ చూపలేదు. రిటైరయినరోజు భార్యకు జీవితంలో మొదటిసారి పట్టుచీరె కొనుక్కురావటం - కొడుకు కోడలు ఏమనుకొంటారోనన్న సిగ్గుతో ఒకవైపు, మరోవైపు భార్యకు అకస్మాత్తుగా ఆ చీరె చూపి ఆశ్చర్యంలో ముంచేసి, ఆ ఆశ్చర్యంలోనుంచి భార్య తనవైపు ఆరాధనగా చూస్తుంటే ఆనందించాలన్న కోరిక!

రంగనాథానికి ముప్పైఏళ్ళకు పైన ఏనాడో గడిచిపోయిన మొదటి రాత్రి గుర్తుకొచ్చింది. ఆనాడుకూడా అతను బాధ్యతల్ని గుర్తుచేసుకొంటూనే వున్నాడు. ఆ క్షణంలోకూడా ఉద్యోగ ధర్మాన్ని గూర్చే ఆలోచించాడు.

కానీ యీనాడు! యీ రాత్రి? బాధ్యతల బంధాలనుంచి విముక్తుడయ్యాడు. శేషజీవితాన్ని ఏ బాధ్యతలు, భయాలు లేకుండా హాయిగా ... అందంగా... ఆనందంగా...

వాకిట్లో అడుగులచప్పుడు విన్పించింది. అడుగులచప్పుడుకు లయగా విశాలాక్షి కాలి మెట్టెల చప్పుడు.

రోజూ యీ వేళకి రంగనాథం నిద్రపోయేవాడు. ఆ స్థితిలో తనని చూచి భార్య ఏమనుకునేదో? ఏం చేసేదో?...తెలుసుకోవాలన్న వెర్రికోరిక రంగనాథానికి అకస్మాత్తుగా పుట్టింది. నిద్రపోతున్నట్లు నటిస్తూ పడుకొన్నాడు.

విశాలాక్షి లోపలి కొచ్చింది. మర చెంబు రంగనాథం తలాపిగా పెట్టింది. భర్త పాదాలకు నమస్కరించి, మంగళ సూత్రాన్ని కళ్ళకద్దుకొంది. లైటు ఆర్పి పక్కనే వున్న తన మంచంమీద పడుకోబోతోంది.

"విశాలా" ప్రేమగా పిల్చాడు రంగనాథం.

"మీరింకా నిద్రపోలేదూ యివాళ?"

"చెప్తాగాని ముందా లైటువెయ్యి."

"రిటైరయిపోయినందుకు దిగులు పడ్తున్నారా ఏమిటి?"

లైటు వెలిగింది. మంచంమీద లేచి కూర్చొని తనవైపే చూస్తున్న భర్తను చూచి ఆశ్చర్యపోయింది. ఆయన కళ్ళు వింతగా ప్రకాశిస్తున్నాయి. ప్రొద్దున సరిగ్గా అలాగే చూచాడు. సిగ్గు ముంచు కొచ్చి తలవంచేసింది విశాలాక్షి.

"పిచ్చి విశాలా, కొత్తనీళ్ళకు పాత నీళ్లస్థానంయిచ్చి ముందుకు పోవాలి. కదలకుండా నిల్చిపోతే ఆ నీటిలో నాచు మొలుస్తుంది. మురికి పడ్తాయి. రిటై రయినందుకు నాకు బాధగాలేదు. ఆనం దంగావుంది. ఎందుకో తెల్సా? యిక నుంచి రోజూ పగల సమానం నిన్నిలా చూస్తూ కూర్చోవచ్చుకదా అని!'' ఆమె రెండుచేతుల్ని తన చేతుల్లోకి తీసు కొంటూ అన్నాడు.

"ఛీ, ఏమిటండీ యిది. ముసలి తనానికి..."

"వయసులో వున్నప్పుడు మనసు ముసలిదయింది విశాలా. వయసు వాలేక మనసుకు యవ్వనం వచ్చింది.తప్పా?"

విశాల మాట్లాడలేదు. బహుశా ఆ కొత్త అనుభూతిలోని సుఖం ఆమె మాటల్ని కట్టేసి వుండవచ్చు.

''నన్ను నువ్వు క్షమించాలి విశాలా. యిన్నాళ్ల నీ కోరికల్ని వేటినీ తీర్చలేక పోయాను. యివాళ... యివాళ..."

ఏమిటయిందన్నట్టు చూచిందామె!

"నీ కోటి తీసుకొచ్చాను. ఏమిటో చెప్పుకో చూద్దాం."

"కనపడ్తూనే వుందిగా" విశా లాక్షి అదోవిధంగా నవ్వింది. "సినిమా వేషాలు. సినిమాలో హీరోలా ఆ చూపులేందబ్బా! నాకు సిగ్గేస్తోంది."

"అందుకే యింత అందంగా వున్నావు...యింతకీ ఏం తీసుకొచ్చానో చెప్పుకోలేదు."

"చెప్పటం ఎందుకు. మీ కళ్ళల్లో కన్పిస్తూనే వుందిగా! ప్రేమ-"

ప్రేమ! ప్రేమ!!

ఆ పదాన్నే మర్చిపోయాడు తను.

కానీ విశాల యిన్నాళ్ళూ ఆ పదాన్ని మనసులోనే రహస్యంగా దాచుకొందన్న మాట!

"అవును. ప్రేమకానుక. యిదిగో..."

పట్టుచీరె చూస్తూనే విశాలాక్షి కళ్ళు తళుక్కుమన్నాయి. ఒక్కసారిగా చేతిలోకి తీసుకొని గుండెల కద్దుకొంది. అంతలోనే ఆమె మొహంలో భావం మారింది.

"ఎందుకండీ యిప్పుడింత డబ్బు ఖర్చుపెట్టి కొన్నారు. రిటైరుకూడా అయ్యారు. యిక వాడొక్కడి రెక్కల మీద బతకాలి. పైగా కోడలేమను కొంటుంది? యింతకీ యిప్పుడింత డబ్బెక్కడిది?"

అవన్నీ రంగనాథం ఆలోచించని మాట వాస్తవమే. యిప్పుడు భార్య ఆ ధోరణిలో ఆలోచించటమూ యిష్టం లేకపోయింది.భార్యమీద కోపంవచ్చింది. అలిగినట్లు మూతిపెట్టేడు.

"అందుకే అందరిలో యిందాకా చెప్పలేదు! ఎన్నాళ్ళబట్టో అడుగు తున్నావని తీసుకొస్తే... బీదకూతలు కూస్తావ్? కోడలు ఏమనుకొంటుంది? మా అత్తగారికి యిన్నాళ్ళకైనా పట్టు చీరె వచ్చిందే అని సంతోషిస్తుంది."

"ఎంత పిచ్చివారండీ...?"

"అవును పిచ్చివాడినే. కనుకే..." వెళ్ళి మంచంమీద పడుకొని ముసుగు తన్నేడు.

వెంటనే వచ్చి విశాల తన అలక తీరుస్తుందని ఆశించాడు. కానీ నిముషం ... రెండు ... మూడు ... ఐదు ... పదినిముషాలు కావస్తున్నా యింకా రాదేం? పట్టుచీరె కోడలికిద్దామని మడతపెట్టి తనూ ముసుగుతన్ని పడుకోలేదుకదా?

"కోపం వచ్చిందా?"

ముసుగు తొలిగిద్దామనుకొంటున్న రంగనాథం భార్య చెయ్యి బట్టతలమీద పడగానే ముసుగును గట్టిగా బిగించాడు.

"రాదేంటి ? ఆఫీసువాళ్లు బహుమానంగా యిచ్చిన చీరెను ప్రేమతో నీకిస్తే..."

"ఆఫీసువాళ్ళిచ్చారా?" విశాలాక్షి విరగబడి నవ్వసాగింది. ఆ నవ్వు ఎంత కమ్మగావుంది? రంగనాథానికి భార్య నవ్వును మరికొంతసేపు వినాలని బుద్ధిపుట్టింది.

"యిన్నాళ్ళ మీ కృషికి మంచి బహుమానం యిచ్చిందండీ మీ పెద్ద భార్య? యిన్నేళ్ల తన కొంగుకు కట్టేసు కొని యివాళ ముసలితనం వచ్చిందని వదిలేస్తూ సవితికివ్వమని పట్టుచీరె యిచ్చిందా? భలే...భలే..." తెరలు తెరలుగా నవ్వసాగింది. పాపికొండల మధ్య పాడుతూ గోదావరిచేసే శబ్దంలా గుంది, ఆ నవ్వు. అయినా భార్య ఎద్దే వను భరించలేకపోయాడు రంగనాథం. కోపంవచ్చింది. భార్యను పట్టుకొని...

"ఆ పా నవ్వు" ముసుగు విసిరి పారేసి చివాలున లేచాడు రంగనాథం.

ఎదురుగా పట్టుచీరె కట్టుకొని మహా లక్ష్మిలా, పార్వతిలా, అప్సరసలా, మేనకలా, వీళ్ళందరి జేజమ్మలా వయ్యారంగా నిల్చొనివున్నది విశాలాక్షి. కంటిగుడ్లు అలసిపోయిందాకా అలాగే చూస్తుండిపోయాడు.

అయినాకూడా కొట్టడానికి ఎత్తిన చేతిని దించలేదు రంగనాథం.

"నిన్నూ ... నిన్నూ ... నిన్నిక వూరుకోను" అంటూ రెండుచేతుల్తో ఆమె భుజాలుపట్టుకొని అమాంతంగా లాక్కొన్నాడు.

* * *

మూడురోజులు ఎలా గడిచి పోయాయో రంగనాథానికి తెలీదు. భార్య పైటకొంగుకు అతుక్కుపోయాడు. విశాలాక్షిమాత్రం తన పనుల్ని తాను యథాప్రకారం చేసుకొంది.

ఎదురుగా వుంటే భార్య ఎన్నో పనులు చేయిస్తుందనుకొన్నాడు రంగ నాథం. కాని ఏ పని చేయబోయినా "మీరూరుకోండి. నేను చేసుకొంటాగా? పెద్దవాడికి పనికి పోయే టయిమయింది. పిల్లలకి భోజనాలు పెట్టాలి. అన్నిటికీ అడ్డంవచ్చి ఆలస్యం చేయకండి. పైగా కోడలు చూస్తే బాగుండదు-"

అప్పటికీ బుజ్జిగాడు-కాలాంతకుడు- అననే అన్నాడు "ఏమిటి తాతయ్యా. నానమ్మను ఎప్పుడూ అలా చూస్తావేం?" అని.

విశాలాక్షి సిగ్గుతో చచ్చిపోయింది. కాని రంగనాథం పడిపోయిన మీసాన్ని గర్వంగా మెలివేసేడు.

నాలుగోనాడు సాయంకాలం రంగ నాథం నెత్తిన పిడుగుపడింది.

అర్జంటుగా రమ్మని అల్లుడిదగ్గరి నుంచి టెలిగ్రాం. కారణం తెలీదు.

"పోనీ నువ్వూ రారాదుటే. యిద్దరం నాలుగురోజులు అక్కడే వుండిపద్దాం."

"సిగ్గులేదుటండీ - మరీ చిన్నపిల్లలై పోతున్నారు. అల్లుడు మిమ్మల్ని రమ్మంటే నన్నూ తీసుకపోతారా? ఫర్వాలేదు వెళ్ళిరండి."

వెళ్ళేటప్పుడన్నా భార్య 'త్వరగా రండి' అని రహస్యంగా చెప్తుందని ఆశించాడు రంగనాథం. ఊహు... ఎంతకీ కూతురు కబుర్లే. అప్పడాలు... ఆవకాయలు...

వెళ్ళబోతుంటే దానిల్లు చల్లగా మనవ రాలు అంది "తాతయ్యా, నా పుట్టిన రోజు నాలుగురోజులే వుంది. వచ్చేస్తావు కదూ?" అని

అమ్మయ్య! నాలుగోనాటికైనా ఏదో మిషపైన వచ్చేయచ్చు.

"వస్తానమ్మా, నా బుజ్జితల్లి పుట్టిన రోజుకు రాకుండా వుంటానా? రాక పోతే మీ నాయనమ్మ వూరుకుంటుందా?"

* * *




కూతురు యింటికి వెళ్ళేడన్నమాటే గాని రంగనాథం ప్రాణం అంతా యింటి మీదేవుంది. వెళ్ళినపనికూడా అయి పోవటంతో, కూతురూ, అల్లుడూ ఎంత బతిమాలినా వినకుండా మూడోరోజు రాత్రికి యిల్లు చేరుకొన్నాడు.

పిల్లలంతా నిద్రపోతున్నట్లుంది. కొడుకుగదిలో బెడ్‌లైటు మాత్రమే వెలుగుతోంది.

తలుపుచప్పుడు వింటూనే వంట యింట్లో పనిచేసుకొంటున్న విశాలాక్షి వచ్చి తలుపు తెరిచింది. భర్తనుచూచి ఆశ్చర్యపోయింది.

"మీరా! అప్పుడే వచ్చారేం?"

రంగనాథం కుదేలయ్యాడు. "వచ్చారా? నాకు తెల్సు మీరు వస్తారని కళ్ళు కాయకాచేలా మీకోసమే ఎదురు చూస్తున్నాను" అని భార్య చాటంత ముఖంచేసుకొని అని వున్నట్లయితే ఏనుగెక్కి వుండేవాడు.

"ఏం? రాకూడదా ?"

"అహ - అబ్బాయికూడా రేపొద్దున వస్తారనే అన్నాడులెండి. యీ రాత్రికే వస్తారని అనుకోలేదు. అందుకని అన్నా. సరే, కాళ్ళు కడుక్కోండి, యీ లోగా..."

"చేసిన మర్యాద చాల్లే, ఫలహారం దోవలో ముగించే వచ్చాను. తమరు త్వరగా పని తెముల్చుకొని వో గ్లాసు పాలో మజ్జిగో నా మొహాన పోస్తే పడుంటాం-" కాళ్లూ చేతులూ కడుక్కొని గదిలోకి విసురుగా వెళ్ళేడు.

ఎంతోసేవు నిరీక్షణ లేకుండానే

మెట్లెలచప్పుడు విన్పించింది. ఆ చప్పుడు వింటూనే రంగనాథం కోపం, అలక మాయమయ్యాయి. గుండెల్లో ఏదో ఆనందం...

విశాలాక్షి ఆకారాన్ని చూడగానే మళ్ళీ కోపం కట్టలు తెంచుకుంది. యీ తడవ కోపం నిజం. "పట్టుచీరెకట్టు కొనే తీరిగ్గాడా లేదన్నమాట!"

కొత్తపెళ్ళికూతురిలా విశాలాక్షి మనోహరంగా నవ్వింది. మంచంమీద ఆయన పక్కన కూర్చొని భుజంమీద చెయ్యివేసింది.

"ముందీ పాలు తాగండి. నరసింహ స్వామి శాంతిస్తాడు."

భుజంమీద చెయ్యిపడగానే శాంతిం చాడు రంగనాథం. అయినా అలకను ప్రదర్శించాడు. "యిక వెళ్ళి పట్టుచీరె కట్టుకురా. నేను నిన్ను యీ పిచ్చి చీరెలో చూడలేను."

"పట్టుచీరెలో వుందిటండీ ప్రేమ? యిదిగో యిక్కడవుంది" అంటూ విశాలాక్షి భర్త గుండెలకు చెంపను ఆనించింది. రంగనాథం చేతుల్ని తన గుండెలకు హత్తుకొంది.

"అవును, నిజమే కానీ..."

"పట్టుచీరె సంగతి మర్చిపోండి. రేపు మాట్లాడుకొందాం. అలసిపోయి వచ్చారు, హాయిగా పడుకోండి."

పట్టుచీరె ప్రసక్తి మరి ఎత్తలేక పోయాడు రంగనాథం!

* * *

తెల్లవారింది. యిల్లంతా సందడిగా వుంది. అసలే ఆదివారం. దానికితోడు మనవరాలి పుట్టినరోజు.

నిద్రలేచి గడియారం చూచుకొని గతుక్కుమన్నాడు రంగనాథం. రిటైరయిన దగ్గర్నుంచి తాఫీగానే నిద్ర లేస్తున్నాడు. అయినా తొమ్మిదిన్నర!

పెరట్లోకి పోవాలంటే సిగ్గువేసింది. అలాగే వెళ్ళి కాలకృత్యాలు ముగించు కొచ్చాడు.

"తాతయ్యా... తాతయ్యా... నా పరికిణీ ఎలావుంది?" అంటూ అమాంతం మెడచుట్టేసుకొన్న మనవరాలి సంతోషాన్ని చూచి వుక్కిరిబిక్కిరి అయ్యాడు రంగనాథం.

రంగనాథం జీవితంలో సంతోషించిన ఘడియలు లేకపోలేదు. ఒక విధంగా ఆయన అల్పసంతోషి. ఇంక్రిమెంటు యిచ్చినప్పుడు, తనకు రావల్సిన డబ్బే బకాయిపడి ఎప్పటికో చేతిలో పడ్డప్పుడూ సంతోషించాడు. ప్రమోషన్ చాలా ఆలస్యంగా వచ్చిన్నాడు సంతోషించాడు. తనచేత గాడిద చాకిరీ చేయించుకొని, కేవలం వొక మెచ్చుకోలు మాటంటే బ్రహ్మానందపడి పోయాడు.

అవన్నీ ఒక ఎత్తు, భార్యకు పట్టుచీరె కొన్నక్షణంలో పొందిన సంతోషం ఒకఎత్తు.



అయితే యిప్పుడు ఆ చిన్నపిల్ల కళ్ళల్లో సంబరాన్ని సంతోషాన్ని చూస్తూ పొందిన అనుభూతి వాటన్నిటినీ మించింది. ఆ పిల్ల కళ్ళల్లో వెయ్యి దీపాల వెలుగు—కోటి దివ్వెల కాంతి!

జీవిత పరమార్థాన్ని తెల్సుకొన్న తృప్తికలిగింది. ఆ క్షణంలో మనవ రాలిని ముద్దుపెట్టుకొన్నాడు. మనసారా ఆశీర్వదించాడు.

"తాతయ్యా! యిది నువ్వు తెచ్చిన పరికిణీకాదు. పట్టుపరికిణీ."

అప్పటికిగాని రంగనాథం మనవ రాలు కట్టుకొన్న పరికిణీని పరీక్షగా చూడలేదు. చూచి గతుక్కు—మన్నాడు.

"నువ్వు మంచోడివి కాదు తాతయ్యా. నాయనమ్మే మంచిది."

"ఏం?"

"నాయనమ్మకు పట్టుచీరె కొను

కొ౯చ్చావ్? నాకేమో పిచ్చి పరికిణీ గుడ్డ తెచ్చావ్."

"నాయనమ్మ పెద్దదికదా మరి!"

"నీకేంతెలీదు తాతయ్యా. పిచ్చోడివి. పెద్దవాళ్ళకి పట్టుచీరె లెందుకు? నేనైతే యించక్కా బడికి వెళ్తాను. స్నేహితులకి చూపిస్తాను. నాయనమ్మ ఎక్కడికెళ్తుంది? ఎప్పుడూ వంటింట్లోనే వుంటుందిగా?"

రంగనాధానికి ఏంమాట్లాడాలో తోచలేదు. తను యిన్నాళ్ళుగా చూడలేని సత్యాలు అతనికి దృగ్గోచరమౌతున్నాయి.

"మీ తాతయ్యకు నువ్వైనా అలా బుద్ధి చెప్పమ్మా. మరీ చిన్నపిల్లాడయిపోతున్నారు."

రంగనాథం భార్యవైపు ప్రేమగా చూచాడు.

"మా నాయనమ్మ మంచిది పట్టు పరికిణీలు రెండు కుట్టించింది" అనేసి గంతులేస్తూ వెళ్ళిపోయింది, మనవరాలు.

ముసలి దంపతులు ఒకర్నొకరు మార్చి మార్చి చూసుకొన్నారు. మెచ్చుకోలు, సిగ్గు, ఆనందం, ఆరాధన... మౌనంగానే మాట్లాడుకొన్నారిద్దరూ.

"నన్ను క్షమించండి. మీరు ప్రేమగా తెచ్చిన పట్టుచీరెను..."

"నా తప్పును నువ్వు సరిదిద్దేవు విశాలా. అందుకే ఆడవాళ్ళు ఎక్కువ వివేకవంతులంటారు. అందులోనూ సంసార సంబంధంగా, పిల్లల విషయంలో, పట్టుచీరె నువ్వు కట్టుకొంటే ఆ ఆనందం నా ఒక్కడికే. ఆ పిల్ల కట్టుకొంటే యీ యింటికే ఆనందం. యీ జగత్తుకే ఆరోగ్యం. యిది ప్రేమ స్వరూపం. సృష్టిరహస్యం! సృష్టిలో తీయనిది..."

"ఊ! తెల్సుకొన్నారే?యిక పూర్వంలాగా నన్ను మర్చిపోతారు కాబోలు."

రంగనాధం భార్యని కొన్నిక్షణాలు పరిశీలించాడు. నవ్వేడు. "ఊహూ. నిజానికి నా మనవరాలి నాయనమ్మా— నువ్వు పట్టుచీరలో కన్నా, యీ పాత చీరలోనే ఎంతో హుందాగా, స్వభావసిద్ధంగా, అందంగా వుంటావు విశాలాక్షమ్మా."

విశాలాక్షి సిగ్గుతో తలవంచక తప్పలేదు!